క్లుప్తంగా

ఫ్లెక్సీల తొలగింపు



మున్సిపల్ కార్యాలయం వద్ద శిలా ఫలకంపై పేపర్లు అతికిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఆదోనిటౌన్: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో శనివారం ఆదోని పట్టణంలో మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది ప్రధాన రోడ్లు, కూడళ్లు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన బ్యానర్‌లు, ఫ్లెక్సీలను తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. భీమాస్ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, పాత బస్టాండ్, మున్సిపల్ కార్యాలయం తదితర ఏరియాల్లో మున్సిపల్ సిబ్బంది ఫ్లెక్సీలు, బ్యానర్‌లను తొలగించే పనులు చేపట్టారు. ఎన్నికల నియమావళిని తప్పకుండా పాటించాలని మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి కోరారు.

కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ కార్యాలయం ప్రారంభం



పూజలు చేస్తున్న కమీషన్ ఏజెంట్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు

ఆదోనిఅర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం కమీషన్ ఏజెంట్స్ అసోసియేషన్ కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. అధ్యక్ష కార్యదర్శులు చంద్రకాంత్‌రెడ్డి, వీరభద్రగౌడ్ పాల్గొని కార్యాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం జనరల్ బాడీ మీటింగ్ జరిగింది. వారు మాట్లాడుతూ మార్కెట్‌యార్డులో అసోసియేషన్ నియమ, నిబంధనలు పాటించాలన్నారు. ఏ సమస్య వచ్చినా వెంటనే అసోసియేషన్ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు రాజాగౌడ, శ్రీరాములు భగవాన్‌సింగ్, ఏజెంట్లు, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

రాజగోపుర నిర్మాణానికి రూ. 50 వేల విరాళం



దాతకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న అర్చకులు

కౌతాళం: ఉరుకుంద గ్రామంలోని ఈరన్న స్వామి దేవాలయంలో రాజగోపుర నిర్మాణానికి కర్ణాటక రాష్ట్రం శిరుగుప్ప పట్టణానికి చెందిన ఆల్లయ్యశెట్టి కుటుంబ సభ్యులు శనివారం రూ.50 వేల విరాళం అందజేశారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ హెచ్. వెంకటేశ్వర్లు వారికి దర్శన ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులు విరివిగా విరాళాలు అందజేసి ఆలయ అభివృద్ధికి పాటుపడాలని కోరారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు



కౌతాళం: మండలంలోని ఆంజనేయ స్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలివచ్చి విశేష పూజలు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు అగసలదిన్నె, బుడుములదొడ్డి, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజనేయస్వామి దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామున అర్చకులు స్వామి వారికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి పూజలు జరిపించారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ



రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్

కోసిగి: మండల పరిధిలోని మూగలదొడ్డి గ్రామంలో సర్పంచ్ కె. శివలింగమ్మ, వీఆర్వో రామాంజనేయులు లబ్ధిదారులకు ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. శనివారం ఉదయం గ్రామ సచివాలయ ఆవరణలో జగనన్న కాలనీలో ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులకు వాటిపై సర్వహక్కులు కల్పిస్తున్న పత్రాలు అందజేశారు. గ్రామంలో 88 మందికి రిజిస్ట్రేషన్ చేయించినట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కె.సోమేష్, ఆంజినయ్య, ఉసేని, రామిరెడ్డి, మల్లికార్జున, లచ్చయ్య, వీరేష్, చిన్నా వీరారెడ్డి పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం

మద్దికెర: వంద లీటర్ల నాటు సారాను పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. నాటు సారా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో మండల శివారులో పోలీసులు తనిఖీలు చేపట్టారు. సాతుపాటి చిరంజీవిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి వంద లీటర్ల నాటుసారా, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు పత్తికొండ రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండుకు తరలించామన్నారు.

అమరజీవి త్యాగం చిరస్మరణీయం





పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ, అధికారులు, ఆదోనిలో నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆదోనిరూరల్: ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో శనివారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి సి.ఆర్.శేషయ్య, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, ఉప తహసీల్దార్లు కౌసర్‌బాను, వినీత్ తదితరులు పాల్గొన్నారు.

ఆదోనిటౌన్: ఆదోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు దేవా ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ముందుగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యకర్తలు నివాళులర్పించారు. కార్యక్రమంలో పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పోలకల్ రేణుక, నాయకులు, కార్యకర్తలు సింహం నాగేంద్ర, సురేష్, సుధాకర్, ఏసేబు, గంగాధర్, తాయన్న తదితరులు పాల్గొన్నారు.

ఆదోనిఅర్బన్: పట్టణంలోని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా), మహిళా విభాగ్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక మున్సిపల్ మెయిన్ రోడ్డులో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. అవోపా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనాథ్ గుప్తా, శ్రీధర్, సభ్యులు రఘు, రాజేష్, కిరణ్, మహిళా విభాగ్ అధ్యక్ష కార్యదర్శులు మమతశ్రీ, సంగీత తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు మజ్జిగ పంపిణీ చేస్తున్న అవోపా సభ్యులు

అప్రమత్తంగా ఎన్నికల విధులు నిర్వహించాలి



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ

ఆదోనిరూరల్: ఎన్నికల్లో ప్రతి అధికారి అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదోని ఎన్నికల అధికారి, సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ అన్నారు. శనివారం ఉదయం సబ్‌కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఎంసీసీ, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్టీ బృందాలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఆదోని నియోజకవర్గంలో 256 పోలింగ్ కేంద్రాల్లో 26 సెక్టోరల్, రూట్ ఆఫీసర్లు ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఎన్నికల కమిషన్ సూచించిన విధులు, బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘించిన వారిపై తీసుకున్న చర్యలపై రోజువారీ నివేదిక అందించేలా సిబ్బందికి సూచనలు చేశారు. మద్యం, లిక్కర్ తదితర వస్తువులు పట్టుబడ్డ సమయంలో ఫ్లయింగ్ స్క్వాడ్, సర్వేలెన్స్ వీడియో రికార్డు తప్పనిసరిగా చేయాలన్నారు. ఎన్నికల నియామవళి ప్రకారం ప్రజలు రూ.50 వేల లోపు నగదు మాత్రమే తీసుకెళ్లేందుకు అనుమతి ఉందని, ఆ పై నగదుకు సంబంధిత పత్రాలు చూపించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల విధుల్లోనిర్లక్ష్యం వహిస్తే శాఖా పరమైన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హసీనాసుల్తానా, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ రామేశ్వర్‌రెడ్డి, డీఎల్‌పీఓ కార్యాలయ పరిపాలనాధికారి వీరభద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

గో సంరక్షణకు కంకణబద్ధులవుదాం



గోపూజలో పాల్గొన్న భక్తులు

పెద్దకడబూరు: గో సంరక్షణకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని తిరుమల తిరుపతి హిందూ ధర్మ ప్రవచకులు బ్రహ్మచారి జయదేవానందస్వామి అన్నారు. హెచ్.మురవణి గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో 5 రోజులుగా జరుగుతున్న తిరుమల తిరుపతి దేవస్థాన ధార్మిక కార్యక్రమాలు శనివారంతో ముగిశాయి. బ్రహ్మచారి జయదేవానంద స్వామి కుంకుమార్చన, గోపూజ నిర్వహించి కార్యక్రమాలకు ముగింపు పలికారు. ఈ సందర్భంగా భజనలు, మహాభారతం, భగవద్గీతలపై ధార్మిక ప్రవచనాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సత్యనారాయణస్వామి దంపతులు, నల్లాన్ చక్రవర్తుల మురళీ మోహనాచార్యులు, భజన మండలి నంబి నరసింహమూర్తి, గోవిందు, శ్రీశైలాచారి, ఈరన్న, కృష్ణ, భూమిక, హనుమంతు, వీరేష్, భూషన్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

రాజీయే రాజమార్గం



కేసులు పరిష్కరిస్తున్న ఇన్‌చార్జ్ జడ్జి దివ్య

ఆలూరు రూరల్: రాజీమార్గమే రాజమార్గమని ఆలూరు జూనియర్ సివిల్ కోర్టు ఇన్‌చార్జ్ జడ్జి దివ్య అన్నారు. శనివారం స్థానిక కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా కక్షిదారులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. క్షణికావేశంతో నేరాలకు పాల్పడి జైలు, కోర్టులకు వెళ్లాల్సిన పరిస్థితి తెచ్చుకోవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా 31 కేసులను పరిష్కరించినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో బార్ అండ్ అసోసియేషన్ కార్యదర్శి విజయ్ భాస్కర్ సీనియర్ న్యాయవాదులు వాయుజీవోత్తమరావు, ప్రవీణ్‌కుమార్, కె.రవి, హెచ్‌కే రవి తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యం, బైక్‌తో సెబ్ సీఐ భార్గవరెడ్డి, ఎస్ఐ సత్యనారాయణ

ఎమ్మిగనూరురూరల్: సెబ్ సర్కిల్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక సెబ్ కార్యాలయం అవరణలో పట్టుబడిన మద్యం, బైక్‌ను మీడియాకు చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రాలయం మండలం చెట్నేపల్లె గ్రామం దగ్గర స్కూటీపై వస్తున్న వ్యక్తులను నిలిపి తనిఖీ చేయగా నాలుగు బాక్సుల్లో కర్ణాటక మద్యం కనిపించిందన్నారు. గొల్ల గిడ్డయ్య, లక్ష్మీపేటకు చెందిన వడ్డె నవీన్, చెట్నేపల్లికి చెందిన బోయ మహానందిలను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 432 (90ఎంఎల్) ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లను, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసుకు సంబంధించిన పట్టణంలోని సంజీవనగర్‌కు చెందిన బోయ ధర్మేంద్ర పరారీలో ఉన్నాడని తెలిపారు. తనిఖీల్లో సెబ్ ఎస్ఐ సత్యనారాయణ, కానిస్టేబుళ్లు నరసింహారెడ్డి, భరత్, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంజిహళ్లి ఉరుసు



భక్తులతో కిటకిటలాడుతున్న దర్గా

గోనెగండ్ల: మండల పరిధిలోని గంజిహళ్లి గ్రామంలో బడేసాహబ్ ఉరుసు శనివారం వైభవంగా జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక తదితర ప్రాంత్రాల నుంచి వేలాది మంది భక్తుల రాకతో దర్గా పరిసరాలు కిటకిటలాడాయి. భక్తులు బడేసాహబ్ తాతను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఉరుసు సందర్భంగా వెలసిన అంగళ్లలో మహిళలు గాజులు కొనుగోలుకు అధికప్రాధాన్యత ఇచ్చారు. చిన్నారుల కోసం అంగళ్లలో ఏర్పాటు చేసిన బొమ్మలు, రంగురాట్నాలు ఆకట్టుకున్నాయి. ఉరుసులో ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా సీఐ రామకృష్ణయ్య ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

పత్తికొండ- కర్నూలు రోడ్డుకు మరమ్మతులు



జేసీబీతో పనులు చేస్తున్న దృశ్యం

పత్తికొండటౌన్: పట్టణం నుంచి కర్నూలు రోడ్డులో దూదేకొండ సమీపంలోని హంద్రీనది బ్రిడ్జి వరకు ప్రధానరోడ్డుకు రూ.2.30 కోట్లతో మరమ్మతులు చేపట్టారు. రెండు రోజులుగా పనులు వేగంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చొరవతో నిధులు విడుదలైనట్లు కాంట్రాక్టరు దశరథరామి రెడ్డి తెలిపారు.

19న మార్కెట్ వేలాలు

ఆలూరు రూరల్: ఈనెల 19న ఆలూరు పంచాయతీ పరిధిలోని మార్కెట్లకు బహిరంగ వేలాలు నిర్వహించనున్నట్లు ఈఓపీఆర్డీ ప్రకాష్ నాయుడు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారపు సంత మార్కెట్, దిన కూరగాయ మార్కెట్, బస్టాండ్ వద్ద ప్రైవేటు వాహనాల పార్కింగ్ ఫీజు వసూలు కోసం నిర్వహించనున్న వేలంపాటలో ఆసక్తి ఉన్న వారు పాల్గొనాలన్నారు.

డీడీఓలుగా పంచాయతీ కార్యదర్శులు

తుగ్గలి: మండలంలోని 9 గ్రామ పంచాయతీలకు చెందిన గ్రేడ్-5 కార్యదర్శులను డీడీఓలుగా నియమిస్తూ జిల్లా ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు జారీ అయినట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి శనివారం తెలిపారు. రామాపురం, చిగుర్లగుట్ట తండా, ఉప్పర్లపల్లి, శభాష్‌పురం, రాంపల్లి, రామకొండ, నునుసరాళ్ల, ఎద్దులదొడ్డి, గిరిగెట్ల గ్రామ కార్యదర్శులను డీడీఓలుగా నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయన్నారు.

ఆరుగురిపై బైండోవర్ కేసు

మద్దికెర: మండల పరిధిలోని హంప గ్రామానికి చెందిన నలుగురు, మద్దికెరకు చెందిన ఇద్దరిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్‌బాబు శనివారం తెలిపారు. శాంతి భద్రతలకు భంగం కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట హాజరుపరిచినట్లు తెలిపారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు రాష్ట్ర జట్టు ఎంపిక

కర్నూలు (టౌన్): ఈనెల 17 నుంచి దాద్రా నగర్ హవేలిలో నిర్వహించనున్న 52 వ జాతీయ స్థాయి మహిళా హ్యాండ్‌బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టు ప్రతిభ చాటాలని ఆ క్రీడా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు ఆకాంక్షించారు. రాష్ట్ర జట్టులో శ్రావణి, బ్యూలా శిరీషా, మౌనిక, స్వాతి, దివ్య, కల్యాణి, పూజ, రోజా, షారోన్, సబిత, వర్షిత, సాయి, జట్టు మేనేజర్లుగా ఆయేషా బేగం, కోచ్‌గా జ్యోతి వ్యవహరిస్తారని శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

నేడు 'నాగలి కూడా ఆయుధమే' పుస్తక పరిచయ సభ

కర్నూలు కల్చరల్: ప్రముఖ కవి కొమ్మవరపు విల్సన్ రావు కవితా సంపుటి 'నాగలి కూడా ఆయుధమే' పుస్తక పరిచయ సభ ఆదివారం ఉదయం 10.30 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆవుల బసప్ప, ఆవుల చక్రపాణి యాదవ్ తెలిపారు. హైదరాబాద్ సిటీ కాలేజ్ తెలుగు శాఖాధిపతి ప్రముఖ రచయిత డాక్టర్ కోయికోటేశ్వరరావు కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం గ్రహీత తగుళ్ల గోపాల్ అతిథులుగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. సాహితీ ప్రియులు, కవులు, రచయితలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

డీఎంహెచ్‌ఓకు అభినందనల వెల్లువ



డీఎంహెచ్‌ఓకు అభినందనలు తెలుపుతున్న ఏపీ హంస అసోసియేషన్ నాయకులు

కర్నూలు (హాస్పిటల్) : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్‌కు శనివారం అభినందనలు వెల్లువెత్తాయి. కార్యాలయ ఏఓ అరుణ, సూపరింటెండెంట్ పత్తికొండ శ్రీనివాసులు, కార్యాలయ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగులు, వైద్యసిబ్బంది సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ రఘురామిరెడ్డి, డాక్టర్ హరీష్ చంద్రారెడ్డి, డాక్టర్ మనోజ్, డాక్టర్ మిథున్, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ శ్రీలేఖ, ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు రఘుబాబు, జనరల్ సెక్రటరీ సయ్యద్ షఫి, సిటీ చైర్మన్ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణే లక్ష్యం

కర్నూలు (టౌన్) : ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడమే తమ లక్ష్యమని జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకే పోలీసుల కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సార్వత్రిక ఎన్నికలు నిర్వహించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. అలాగే పోలీసులకు జిల్లా ప్రజలు సహకరించాలని కోరారు. జిల్లాలోని కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు సబ్ డివిజన్లలోని ప్రాంతాల్లో కేంద్ర సాయుధ బలగాలైన సశస్త్ర సీమాబల్ సిబ్బందితో పోలీసు కవాతు నిర్వహించినట్లు తెలిపారు. కోడుమూరు సర్కిల్, గూడూరు పీఎస్ పరిధిలోని చనుగొండ్ల, గూడూరు, గుడిపాడు, అలాగే ఆలూరు సర్కిల్, ఆలూరు పీఎస్ పరిధిలోని మొలగవల్లి, హత్తిబెళగల్, అగ్రహారం, అరికెర, ఆలూరు, పెద్దహోతూరు, ఎమ్మిగనూరు రూరల్ పీఎస్ పరిధిలోని కందనాతి, కడివెళ్ల గ్రామాల్లో పోలీసుల కవాతు నిర్వహించినట్లు తెలిపారు.



ఎమ్మిగనూరు పీఎస్ పరిధిలో పోలీసు కవాతు

సంక్షేమ పథకాలతో అతివల ఆర్థికాభివృద్ధి



మాట్లాడుతున్న ప్రదీప్‌రెడ్డి



పాల్గొన్న మహిళలు

కౌతాళం: ఆడపడుచుల జీవితాల్లో వెలుగులు నింపేందుకే చేయూత, ఆసరా పథకాలు అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం నాయకుడు ప్రదీప్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక సింగిల్ విండో కార్యాలయం వద్ద పొదుపు మహిళలకు వైఎస్సార్ చేయూత, ఆసరా పథకాలకు సంబంధించిన మెగా చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పాదయాత్రలో ఆడపడుచుల సమస్యలు తెలుసుకున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నవరత్నాల్లో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ ఆసరా కింద పొదుపు గ్రూపుల రుణం మాఫీ చేశారన్నారు. అలాగే 45 నుంచి 60 ఏళ్లలోపు మహిళలకు ఏటా రూ. 18,500 చొప్పున నాలుగేళ్లలో రూ. 75 వేలు అందజేసినట్లు తెలిపారు. మండలంలో 4,518మంది మహిళలకు రూ. 8.47 కోట్లు లబ్ధి చేకూరిందని చెప్పారు. అలాగే ఆసరా కింద 8,340 మంది మహిళలకు రూ. 3.27 కోట్ల చెక్కును అందజేశారు. ఈ నాలుగేళ్లలో మొత్తం రూ.13.78 కోట్ల రుణ మాఫీ జరిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరేష్, సింగల్ విండో అధ్యక్షుడు దాట్ల కృష్ణంరాజు, పార్టీ మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, సర్పంచ్ పాల్‌దినకర్, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, మండల కోఆప్షన్ మెంబర్ మహబుబ్‌సాబ్, నాయకులు ఏకాంబర్‌రెడ్డి, దాట్ల సుబ్బారాజు, అవతారం, రాఘవేంద్రరెడ్డి, బసవన్నగౌడ్, ఎంపీటీసీలు లింగన్నగౌడ్, రాజ్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కౌతాళంలో సిమెంటు రోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న నాయకులు

కౌతాళం: మండల కేంద్రం కౌతాళంలో ముమ్మరంగా అభివృద్ధి పనులను చేపట్టినట్లు సర్పంచ్ పాల్‌దినకర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి అన్నారు. శనివారం పల్లేదగేరిలో పంచాయతీ నిధులతో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. అలాగే గడప గడప మన ప్రభుత్వం నిధులతో హనుమాన్‌నగర్‌లో మూడు రోడ్లు, డ్రైనేజీ నిర్మాణంతో పాటు గ్రావెల్ రోడ్డు వేయడానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గడప గడపకు మన ప్రభుత్వం నిధులు సచివాలయానికి రూ.40 లక్షల చొప్పున మూడు సచివాలయాలకు రూ. 1.20కోట్లు మంజూరు చేయడంతో గ్రామంలో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అవతారం, మాజీ ఎంపీటీసీ సభ్యుడు చౌదరిబసవ, నాయకులు అబ్దుల్‌సమద్, వెంకటరామరాజు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

కోసిగి: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని సీడీపీఓ నాగమణి అన్నారు. శనివారం కోసిగి బాలికల ఉన్నత పాఠశాలలో గర్భిణులు, బాలింతలతో కలిసి పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు రక్త పరీక్షలు చేశారు. ఆరోగ్య సూత్రాలను తెలియజేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు నులిపురుగుల నివారణ కోసం మందులు అందజేశారు. అనంతరం పౌష్టికాహారంతో కూడిన స్టాల్స్‌ను ఏర్పాటు చేసి వాటి ఉపయోగాలను వివరించారు. ఆకుకూరలు, గుడ్లు, పాలు, తృణ ధాన్యాలు తీసుకోవాలని సూచించారు. తల్లీబిడ్డా ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో బాలికల పాఠశాల ఉపాధ్యాయురాలు సరస్వతి, శ్రీదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయకుమారి, కాత్యాయని తదితరులు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం.. వ్యక్తి అరెస్ట్



పట్టుబడిన మద్యంతో సెబ్ సీఐ

కోసిగి: మండల కేంద్రంలో కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 6 బాక్సుల 576 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ మహబూబ్ బాషా, ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు. శనివారం కోసిగి గ్రామ శివారులో వాహన తనిఖీలు చేస్తుండగా అదే గ్రామానికి చెందిన రామకృష్ణను పట్టుకున్నామని చెప్పారు. మద్యం స్వాధీనం చేసుకుని బైక్‌ను సీజ్ చేసినట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

కోసిగి మండలంలోని కోసిగి, అగసనూరు గ్రామానికి చెందిన రెండు ట్రాక్టర్లలో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నట్లు సీఐ మమాబూబ్ బాషా తెలిపారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.10 వేల జరిమానా విధించినట్లు చెప్పారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



ఇసుక ట్రాక్టర్లు

వైభవంగా శ్రీరంగనాథస్వామి రథోత్సవం



స్వామివార్ల కల్యాణోత్సవం

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పులికొండ గ్రామంలో వెలసిన సంతాన వరదుడు శ్రీరంగనాథ స్వామి రథోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో 10.25 గంటలకు ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథ స్వామివార్ల కల్యాణం జరిగింది. స్వామివారిని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. సాయంత్రం గ్రామ పురవీధుల్లో భక్తజనుల మధ్యన స్వామివారి రథోత్సవం వైభవంగా సాగింది.

గ్రూపు-1 పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

- జిల్లా అధికారులకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశం

కర్నూలు(సెంట్రల్): నేడు జరిగే గ్రూపు-1 ప్రిలిమ్స్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన విజయవాడ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. గ్రూపు-1 పరీక్ష కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉండడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాగా ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆయన ఆదేశించారు. ఎండలు తీవ్రతరం కానున్న నేపథ్యంలో గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జేసీ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో కె.మధుసూధన్‌రావు, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలి...

ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు మండలాధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. శనివారం సాయంత్రం ఆమె టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీడీఓలు, తహసీల్దార్లతో ఎన్నికల కోడ్ అమలుపై సమీక్షించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జేసీ నారపురెడ్డి మౌర్య, మునిసిపల్ కమిషనర్ భార్గవతేజ, ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, కర్నూలు, పత్తికొండ ఆర్‌డీఓలు ఎం.శేషిరెడ్డి, రామలక్ష్మి పాల్గొన్నారు.